క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రైల్వేస్టేషన్‌లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు



సింహాచలం రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారంపై ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్ ఫారాలపై బోగీల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్, ఏసీ బోగీల వివరాలు అనౌన్స్‌మెంట్‌లో తెలియజేసే వారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఈ డిజిటల్ బోర్డులను ఎక్కడ ఏ బోగి ఉందో ప్రయాణికులకు తెలిసే విధంగా ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డుల వల్ల ఉపయుక్తంగా ఉంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేషన్‌లో రైళ్లు ఎక్కువ సమయం ఆగవు. ఇందులో సగం సమయం బోగీలు వెతుక్కునేందుకు అయిపోయేది. ఇప్పుడు ఆ ఇబ్బంది ఉండదని ప్రయాణికులు చెబుతున్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ఉపాధి హామీ కూలీలకు రెండు వందల రోజుల పని దినాలు కల్పించడంతో పాటు రోజు కూలి రూ.600 చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. భర్నికం గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో గనిశెట్టి మాట్లాడారు. మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పే స్లిప్‌లు మంజూరు చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీల కోసం టెంట్లు, మజ్జిగ, మంచినీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. 30 శాతం వేసవి అలవెన్స్ మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ప్రతీ 15 రోజులకోసారి కూలి డబ్బులు చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

జూలో పిల్లల సందడి



జూలో ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద ఆడుతున్న పిల్లలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో శుక్రవారం పిల్లల సందడి నెలకొంది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో కొద్ది రోజులుగా జూ పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఇక్కడ పక్షులు, ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు, కోతులు, మొసళ్లు, పాముల ఎన్‌క్లోజర్ల వద్ద పిల్లల సరదాగా గడిపారు. జూలో క్యాంటీన్ పక్కన, కనుజుల ఎన్‌క్లోజరు ఎదురుగా ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లలు ఆడుకుంటూ సందడి చేశారు. తల్లిదండ్రుల సహకారంతో ఊయలలు, తోపుడు బల్లలు, జారుడు బల్లలు, తదితర ఆట పరికరాలు ఎక్కి ఎంజాయ్ చేశారు.

బాలికల సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట



సాంస్కృతిక ప్రదర్శనలో బాలికలు



బాలికలతో ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్టు హెడ్ సిన్హా

ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే

పరవాడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ఎన్టీపీసీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలిక సాధికారిత మిషన్-2024 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. పాండే వివిధ అంశాలపై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. బాలికల్లో స్ఫూర్తి నింపింది. సంస్థ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా మాట్లాడుతూ బాలిక సాధికారిత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాపరమైన ప్రేరణ, వ్యక్తిత్వ వికాసం, సాధికారితను పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలతో వర్క్‌షాపు నిర్వహించినట్టు చెప్పారు.
మే 10న ప్రారంభమైన బాలిక సాధికారిత వర్క్‌షాపులో సమీప గ్రామాల నుంచి 120 మంది బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా చేతుల మీదుగా బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, గొర్లివానిపాలెం, పోర్టుకో, పవర్‌సిటీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఈఈ రామకృష్ణ పేర్కొన్నారు.

త్వరితగతిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికారులకు సూచించారు. శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ఎంపీ నిధులు రూ.2 కోట్లు, వీఎంఆర్‌డీఏ నుంచి రూ.2.60 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని చెప్పారు. డీఈ పట్నాయక్, నాయకులు అయిత ఎర్రయ్య, దువ్వి అప్పారావు, గంట్ల నరసింహమూర్తి, చెవ్వేటి జల్లుబాబు, పువ్వాడ త్రినాథ్, కంచిబోయిన సంతోష్, వేణు, భాగ్యలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

డీఎస్పీ సత్యనారాయణ



ఫార్మాసిటీలో మొక్కలు నాటుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జేఎన్ ఫార్మాసిటీలో రాంకీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మనం పర్యావరణాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుందన్నారు. మనం నాటే మొక్కలు భావితరాలకు నీడ, పండ్లు అందిస్తాయన్నారు. అవసరం ఉన్నా లేకపోయినా సహజ వనరులను నాశనం చేసి వినాశనాన్ని కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటడానికి ముందుకు రావాలని డీఎస్పీ సత్యనారాయణ కోరారు. ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు భక్షి మాట్లాడుతూ సహజ వనరులను కాపాడుకోవడం ద్వారా భావితరాల వారికి స్వచ్ఛమైన గాలి, నీరు, భూమిని అందివ్వవచ్చునన్నారు. ఈ ఏడాది 25 వేల వివిధ రకాల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శ్రీవిద్య కోర్సు ప్రారంభం



దేవీపురంలో శ్రీవిద్య కోర్సు నేర్చుకొనేందుకు వచ్చిన విద్యార్థులతో గురుమాత అన్నపూర్ణమ్మ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో శ్రీవిద్య కోర్సును శుక్రవారం ప్రారంభించారు. తెలుగు భాషలో ఈ నెల 7వ తేదీ నుంచి 10 తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఈ కోర్సు నేర్పించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు విద్యార్థులకు ముందుగా శ్రీగురు పాదుకా మంత్రోపదేశం చేసి శ్రీగణపతి,బాల,చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో ప్రాథమిక అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు,తర్పణాలు తియరీతో పాటు ఆచరణాత్మకంగా నేర్చుకొంటారన్నారు. ఆచార్యులుగా మూర్తి రాధ,కె. రమ,షణ్ముఖ వ్యవహరించారు.

1212వ రోజుకు‘ఉక్కు’ రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్ష శిబిరంలో 1212వ రోజు, శుక్రవారం పాల్గొన్న నాయకులు మొదలవలస వెంకటరమణ, పెదిరెడ్ల నీలకంఠం మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడే శక్తి ప్రస్తుతం మన రాష్ట్ర కూటమి నాయకుల చేతుల్లో ఉందని, ఈ విషయంలో చొరవ తీసుకుని పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించడం, సెయిల్‌లో విలీనం చేయడం వల్ల పూర్వ వైభవానికి ఊతమివ్వాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐ రామకృష్ణ



సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి రమణచిట్టి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా గ్రంథాలయం ఆవరణలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలు వేసి అంజలి ఘటించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వేగి దివాకర్, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



సబ్బవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శంకరరావు తదితరులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఎస్ఐ శంకరరావుతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అన్నారు. మంచి పుస్తకం చదవడం ద్వారా అది భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ సెక్రటరీ పీడీవీ రత్నకుమార్, పాఠకులు చందు,సతీష్‌తో విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు




నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

ఘన చరితకు నిలువెత్తు సాక్ష్యం

- బీచ్ రోడ్డులోని హవా మహల్
- వందేళ్లు పైబడినా నేటికీ అదే ఠీవి
- ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన నెలవు

వందేళ్లకు మించిన చరిత్ర ఆ పురాతన కట్టడానిది. అనంత సాగరానికి అభిముఖంగా కాలానికి ఎదురొడ్డి ఠీవిని ప్రదర్శిస్తోంది. రాజుల హయాంలో రూపొంది.. తర్వాతి కాలంలో ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. అనంతర కాలంలో విశాఖలో రూపొందిన మొట్టమొదటి మహిళా కళాశాలగా మారి ఎంతో మందికి విద్యనందించింది. అదే.. నేటికీ బీచ్ రోడ్డులో మనకు కనిపించే హవా మహల్.



నాటి కళాకారుల పనితనానికి మెచ్చుతునక ఈ కట్టడం



ఇలాంటి బలమైన స్తంభాలు ఈ భవంతిలో ఎన్నో..



చెక్కు చెదరని హవా మహల్

దాబాగార్డెన్స్: విశాఖ బీచ్ రోడ్డులోని హవా మహల్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. పలు సినిమాల్లో సైతం కనిపించిన ఈ కట్టడానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉంది. ఒకప్పటి జైపూర్ ఎస్టేట్స్‌లోని కొంత భాగం (ఇప్పటి పాడేరు, అనంతగిరి, అరకు) మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో ఉండేది. జైపూర్ మహారాజులు రాకపోకలు సాగించేందుకు వీలుగా విశాఖలో గుడారాలు వేసుకుని విడిది చేసేవారు. ఈ నేపథ్యంలో విశాఖలో ఒక విడిది గృహాన్ని నిర్మించాలని అప్పటి మహారాజా రామకృష్ణదేవ్ సంకల్పించారు. 1913వ సంవత్సరంలో సాలూరు జమిందార్ వద్ద మూడున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు.
1917లో నిర్మాణం పూర్తయింది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అప్పట్లో విశ్రాంతి భవనాలు లేకపోవడంతో అప్పట్లో ఏయూకి వచ్చే అధికారులు, అతిథులు ఈ హవా మహల్‌లోనే బస చేసేవారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తదితర ప్రముఖులు అప్పట్లో ఇక్కడే బస చేయడం విశేషం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆర్మీ హెడ్ క్వార్టర్లను ఈ భవనంలోనే ఏర్పాటు చేశారు. ఇది 1945 వరకు ఇక్కడే కొనసాగింది. జమీందారి విధానం రద్దయిన తర్వాత ప్రభుత్వం నామమాత్రపు అద్దెపై హవా మహల్‌లో నర్సింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. 1980 నాటికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్రావు హయాంలో జైపూర్ మహరాజా అనుమతితో విశాఖ ఉమెన్స్ కళాశాలను ఏర్పాటు చేశారు. 1991లో కళాశాలను సౌత్ జైల్ రోడ్డుకు మార్చారు.

అద్భుత రాతి కట్టడం..

రాజుల కోటను తలపించే ఈ భవనం రెండంతస్తుల రాతి కట్టడం. దీనిని రెండు భాగాలుగా నిర్మించారు. రోడ్డుపై నుంచి కనిపించేది ప్రధాన భవనం. వెనుకనున్నది కిచెన్ కాంప్లెక్స్. రెండు కట్టడాలకు ఒకే పై కప్పు నిర్మించారు. భవనం మధ్యలో వృత్తాకారంలో ఆర్చిలు, కట్టడానికి ఇరువైపులా సంప్రదాయబద్ధంగా సిమెంట్ కలశాలు నిర్మించారు. హవా మహల్ ముందు, వెనుక భాగాల్లో అర్ధ వృత్తాకారంలో వరండాలు, ఉత్తర, దక్షిణాల్లో రూఫ్ వరండాలు ఉన్నాయి. పై అంతస్తుకు చేరుకునేందుకు గుండ్రటి ఇనుప మెట్లను ఏర్పాటు చేశారు. భవనం వెనుక సర్వెంట్, వాచ్‌మెన్‌లు ఉండేలా నిర్మించారు.

మొదటి ప్రధాని నెహ్రూ, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌లకు ఆతిథ్యం..

నాటి ఎంతో మంది గవర్నర్లు, రాజకీయ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన హవా మహల్ మన దేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు కూడా ఆతిథ్యం ఇచ్చింది. 1961లో హిందుస్తాన్ షిప్‌యార్డు మొట్టమొదటి సారిగా రూపొందించిన జల ఉష నౌకను సాగర ప్రవేశం చేయించేందుకు విశాఖ విచ్చేసిన నెహ్రూ హవా మహల్‌లోనే బస చేశారు. అలాగే మన దేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ విశాఖ విచ్చేసిన సందర్భంగా ఆయన కూడా హవా మహల్‌లోనే బస చేయటం అపూర్వమని చెప్పాలి.

ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలి



ఎకో వైజాగ్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు తదితరులు

ఎంవీపీ కాలనీ: యువత ఎకో వైజాగ్ విజయవంతానికి కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా నిలవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ రామచంద్రమూర్తి పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎకో వైజాగ్, ఆహార భద్రత విశిష్టతను తెలిపే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ, ఆహార భద్రత దినోత్సవాలను పురస్కరించుకుని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవోతో కలిసి పలు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు ప్రచారకర్తలుగా నిలవాలని కోరారు. ఇళ్లలో ప్రకృతి సిద్ధమైన పంటలు పండించడం, వాడకంపై అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కాసు, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, . మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.